క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు


పూజలు చేస్తున్న భక్తులు

డోన్ టౌన్: మండలంలోని అబ్బిరెడ్డి పల్లె గ్రామ సమీపంలోని పెద్ద వంక వద్ద వెలసిన శ్రీ కాశిరెడ్డి నాయన దేవాలయంలో మంగళవారం ఆరాధనోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఉదయం సుప్రభాతసేవ,అభిషేకాలు, అర్చనలు, పుష్పాలంకరణ, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. అనంతరం ప్రజలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అబ్బిరెడ్డిపల్లె, వెంకటాపురం, గుమ్మకొండ,కొయిలకొండ, కంభాలపాడు తదితర గ్రామ ప్రజలు శ్రీకాశిరెడ్డి నాయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం శింగవరంలో సుంకులమ్మ ఆలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పేరం రాంశంకర్ రెడ్డి అమ్మవారికి మొక్కుబడి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, చల్లా విఘ్నేశ్వర రెడ్డి ఆలయానికి చేరుకోగానే రాంశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు రామ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి వెండి పాదుకలు బహూకరణ


ఆంజనేయస్వామికి వెండి పాదుకలను అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని గొరిపేటలో వెలసిన ఆంజనేయస్వామి బాలనటి శ్రీదేవి కుటుంబ సభ్యులు వెండి పాదుకలను బహూకరించారు. స్థానిక తహసీల్ పేట కాలనీకి చెందిన జనార్ధన్‌గౌడు జ్ఞాపకార్థం భార్య లక్ష్మీదేవి, మనవరాలు బాల నటి శ్రీదేవి ఆంజనేయస్వామికి వెండి పాదుకలను ఆలయ మాజీ చైర్మన్ ఇవి సుజాత శర్మ, అర్చకుడు శ్రీకాంత్‌కు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని రెండవ గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి గడపను సందర్శించి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మండలస్థాయి అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ


ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: మండలపరిధిలోని ముద్దవరంలో సర్పంచ్ తిమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ వెంగన్న గ్రామస్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎండ నుంచి రక్షణగా గొడుగులు వాడాలని, కనీసం చేతి రుమాలు ధరించాలని చెప్పారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ పనులను ముగించుకుని వచ్చాక ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో శివ రామయ్య, ఏఎస్ఎమ్ రజిత, సర్వేయర్ శివ పాల్గొన్నారు.

రైతన్న చెంతనే ఎరువులు

- రబీలో 34వేల మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం
- నమోదు చేసుకున్న వెంటనే ఎరువుల సరఫరా
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు


భానుముక్కల సహకార సంఘంలో నిల్వ చేసిన ఎరువులు


పలుకూరు రైతుభరోసా కేంద్రం

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ, వైద్య, విద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. వ్యవసాయం దండగ కాదు పండుగ అనేలా విత్తనం నుంచి దిగుబడులు అమ్ముకునే వరకు రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలుస్తుంది. సకాలంలో పెట్టుబడి సాయం అందజేయడంతో పాటు రైతుభరోసా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా నిర్ణీత ధరలకే ఎరువులను అందజేస్తూ ఆదుకుంటుంది ప్రభుత్వం. రబీలో నంద్యాల జిల్లాలో 1.65లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. ఈ పంటలు సమృద్ధిగా పండాలంటే రైతులకు అందుబాటులో రసాయన ఎరువులు ఉండాలి. ఎరువులు అవసరం ఉన్న రైతులు సంబంధిత ఆర్‌బీకేలు, సహకార సంఘాల్లో నమోదు చేసుకున్న వెంటనే నేరుగా సరఫరా జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా రబీలో ఆర్‌బీకేలు సహకార సంఘాల ద్వారా 34 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను ప్రభుత్వం సకాలంలో అందజేసింది. 411 ఆర్బీకేల ద్వారా 25 వేల మెట్రిక్ టన్నులు, 58 సహకార సంఘాల ద్వారా 9 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేశారు అధికారులు. డీఏపీ, యూరియా కాంప్లెక్స్ తదతర ఎరువులను సరఫరా చేయడం జరిగింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తునారు.

గతంలో నిలువు దోపిడీ

ఆర్‌బీకేలు లేకముందు గతంలో మార్కెట్‌లో ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాల్సివచ్చే ది. మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లోని వ్యాపారుల వద్దకు వెళ్లీ వారు చెప్పిన ధరకే రైతులు కోనుగోలు చేసి రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. రైతుల అవసరాలను అసరగా చేసుకుని కొందరు వ్యాపారులు నిలువు దోపిడీ చేశేవారు. అదేవిధంగా మండల కేంద్రం నుంచి ఎరువులను కొనుగోలు చేసిన తరువాత వాటిని గ్రామాలకు తరలించాలంటే రోజంతా వృథా అయ్యేది. రైతుల వ్యయప్రయాసాలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను నెలకొల్పి సొంత గ్రామాల్లోనే వ్యవసాయానికి సంబంధించిన అన్ని సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. అదేవిధంగా ఆర్బీకే సిబ్బంది రైతులకు వ్యవసాయ సూచనలు ఇవ్వడంతోపాటు పంట నష్టం జరిగినప్పుడు నేరుగా పొలాలకు వెళ్లీ వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిస్తూ పరిహారం అందజేసేందుకు కృషి చేస్తున్నారు ఆర్బీకే సిబ్బంది. ప్రతి రైతుభరోసా కేంద్రంలో ఐదుమంది రైతులతో గ్రూపులను ఏర్పాటు చేసి సబ్సిడీపై ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు అందజేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోటిపైగా ఎరువుల పంపిణీ



బనగానపల్లె మండలం పసుపల గ్రామ పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాల్లో ఆర్‌బీకే ద్వారా రబీ సీజన్‌లో రూ.కోటిపైగా ఎరువులను రైతులు కొనుగోలు చేశారు. సకాలంలో అధికారులు ఎరువులు సరఫరా చేయడంతో రైతులకు సమస్యలు తీరుతున్నాయి. రైతులకు నాణ్యమైన ఎరువులన సరసమైన ధరలకు అందుతున్నాయి. – **జనార్దన్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు పసుపల**

ఆర్‌బీకేలు ఎంతో ఉపయోగం



రైతుభరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. విత్తనాలతోపాటు ఎరువులు అడిగిన వెంటనే సరఫరా చేస్తున్నందున వ్యయప్రయాసాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఆర్‌బీకేల్లో నమోదు చేసుకున్న వెంటనే నిర్ణీత ధరలతో ఎరువులను అందజేస్తున్నారు. ఎరువులు, విత్తనాల కోసం గతంలో చాటా ఇబ్బందులు పడ్డాం. – **శ్రీనివాసరెడ్డి, రైతు వెంకటాపురం**

అవసరం మేరకు ఎరువులు



రైతులకు అవసరం మేరకు సకాలంలో ఎరువులను సరఫరా చేస్తున్నాం. ఎరువుల కొరత ఏ మాత్రం లేదు. రైతుభరోసా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా రైతులు కోరిన వెంటనే ఎరువులు లభిస్తున్నాయి. ప్రభుత్వమే తక్కువ ధరలకే ఎరువులను అందజేస్తుంది. రైతుల దిగుబడులను సైతం కొనుగోలు చేస్తున్నాం. – **నాగరాజు, జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్**

బండిమిట్ట వేలాలు రద్దు

డోన్ టౌన్: మండలంలోని ధర్మారం గ్రామ పంచాయతీ పరిధిలోని బండిమిట్ట వేలాలను రద్దు చేసినట్లు ఈఓఆర్డీ వరప్రసాద్ తెలిపారు. వేలాలు నిర్వహించడానికి మంగళవారం గ్రామ సచివాలయంలో సర్పంచ్ ఎల్లమ్మ ఆధ్వర్యంలో మూడవ సారి సమావేశం నిర్వహించారు. వేలం పాట పాడేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రుసుం పంచాయతీ వారే వసూలు చేసుకునేలా తీర్మానించినట్లు ఈఓఆర్డీ వరప్రసాద్‌తెలిపారు.

పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న మసీదు కమిటీ సభ్యులు

ప్యాపిలి: స్థానిక జామియా మసీదులో మంగళవారం పేద ముస్లిం మహిళలకు చీరలు, నగదు పంపిణీ చేశారు. మసీదు కమిటీ అధ్యక్షుడు మస్తాన్‌ఖాన్, సభ్యుడు మహబూబ్ సాహెబ్ ఆధ్వర్యంలో చీరెలు పంపిణీ చేశారు. ప్యాపిలికి చెందిన ఇస్మాయిల్ హైదరాబాదులో స్థిరపడ్డారు. రంజాన్ మాసం నేపథ్యంలో ముస్లిం మహిళలకు చీరలు, బాలురకు దుస్తులు, బాలికలకు స్కార్ఫ్‌లతోపాటు ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున నగదును కుమారుడు జాకీర్‌తో కలిసి ఇస్మాయిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గఫూర్, మహబూబ్ బాషా, రహంతుల్లా, తాజుద్దీన్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి పెట్టండి

- ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి

అవుకు: ఎండలు రోజురోజుకు మండుతున్నాయని, అధికారులు ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి సూచించారు. మండల కేంద్రం అవుకు ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఉపాధి, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలతోపాటు ప్రతిఒక్కరికీ ఎండల తీవ్రతను వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. అలాగే ఆరోగ్య సిబ్బంది ప్రజలకు ఓఆర్ఎస ప్యాకెట్లను పంపిణీ చేయాలని సూచించారు. కొందరు వ్యాపారులు మామిడి కాయలను కెమికల్స్‌తో మాగబెడుతున్నారని, అధికారులు దృష్టి సారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని చెప్పారు. రామాపురంలో రహదారి పూర్తి అధ్వానంగా మారిందని, నేషనల్ హైవే అధికారులు ఎన్నిసార్లు చెప్పిన స్పందించకపోవటమే కాకుండా మండల్ మీట్‌కు గైర్హాజరు కావడం ఏమిటని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, వైస్ ఎంపీపీ తెలుగు రామప్ప, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, ఎంపీడీఓ అజాం ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు, డాక్టర్ వినోద్ కుమార్, పశువైద్యాధికారి భారతీదేవి, ఎంఈఓ శ్రీధర్ రావు, ఈఓఆర్డీ రామకృష్ణవేణి, పీఆర్, ఆర్‌డబ్ల్యూస్, ట్రాన్స్ కో ఏఈలు గౌస్, కరిముల్లా, పక్కీరయ్య, ఏపీఎం విజయగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో సరికొత్త అధ్యాయం

- ఏపీఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ


ప్రశ్నావళిని నింపుతున్న ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ

కోవెలకుంట్ల: ప్రజల అభ్యున్నతికి వివిధ పథకాలను ప్రవేశపెట్టి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని రెండవ గ్రామ సచివాలయ పరిధిలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటర్లతో కలిసి ఇంటింటిని సందర్శించారు. ఆయా కుటుంబ యజమానుల అనుమతితో వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్లర్లను అతికించారు. కుటుంబ యజమానులతో మాట్లాడి ప్రశ్నావళిని నింపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయ, వలంటీర వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి, యువనాయకుడు కర్రా తేజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సహదేవరెడ్డి, గడ్డం వరప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి


పనులను పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీవిద్య

బేతంచెర్ల: ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ శ్రీవిద్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్ బుక్కా పురం గ్రామంలోని సోమపురం కుంటలో ఉపాధి కూలీలు చేస్తున్న పూడిక తీత పనులను ఆమె పరిశీలించారు. వేసవి ఎండలు మండుతున్నాయని, ఉదయం తొందరగా పనులకు హాజరై త్వరగా ముగించుకోవాలన్నారు. సగటు వేతనం పడేలా పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శేషన్న, టెక్నికల్ అసిస్టెంట్స్ సుబ్బానాయక్, మోహన్, ఫీల్డ్ అసిస్టెంట్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల మహోత్సవం


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

బనగానపల్లెరూరల్: మండలంలోని యనకండ్ల గ్రామంలో పొలిమేర పెద్దమ్మ బోనాల మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి పొలిమేర పెద్దమ్మను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం



బనగానపల్లెరూరల్: మండలంలోని మాదాసుపల్లె గ్రామానికి చెందిన రైతు తెలుగు మద్దయ్యకు చెందిన మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల మేరకు తెలుగు మద్దయ్య ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. రాత్రి పొలంలో మంటలు వ్యాపించడంతో గమనించిన స్థానికులు వెంటనే బనగానపల్లె అగ్నిమాపకశాఖకు సమాచారం ఇచ్చారు. ప్రమాదస్థలాని కి చేరుకున్న అగ్నిమాపక అధికారులు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ఎవరైనా అకతాయిలు పంటకు నిప్పంచారా, పంట వ్య ర్థాలను అంటించడం తోనా అనే విషయాలు తెలియాల్సి ఉంది. సుమారు రూ.4లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆందోళన వ్యక్తం చేశాడు.

పాఠశాల అభివృద్ధికి సీఎం కృషి

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాలల భలోపేతానికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు.మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో 2023–24 సంవత్సరం విద్యాకానుక సంబంధించి స్టాక్‌పాయింట్‌ను స్టేట్ అబ్జర్వర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఎఎంఓ యానిష్ బాషా పరిశీలించారు. ఎంఈఓ సోమశేఖర్ ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుక సంబంధించి విద్యాశాఖలో ఏడు క్యాడర్స్ ఏర్పాటు చేసి పంపిణీ చేసే విషయంపై చర్చించారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


అభిప్రాయాలు సేకరిస్తున్న శ్రీరాములు, రాజశేఖర్‌రెడ్డి

డోన్ టౌన్: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని యు.కొత్తపల్లెలో సర్పంచ్ వై.విద్య ఆధ్వర్యంలో వారు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను శ్రీరాములు, రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు వివరించారు. వెంకటాపురం, గుమ్మకొండ తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగింది. అదేవిధంగా డోన్ పట్టణంలో కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, దారా హరినథ్‌రెడ్డి, పాలుట్ల మీనాక్షి రఘురాం, బోయ సుమలత వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి వార్డుల్లో కలియ తిరిగారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. ఆయా కుటుంబాల యాజమాని అనుమతితో వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అతికించారు.

సింహవాహనంపై చెన్నకేశవస్వామి

బేతంచెర్ల : పట్టణంలోని గొరిపేటలో వెలసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి,భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామిని మంగళవారం సింహవాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో శ్రీదేవి,భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ఆశీనులను గావించి గొరిపేట, కూరగాయల మార్కెట్, బోయపేట, దుర్గాపేట,వడ్డెపేట, మాలపేట, చాకలిపేట, కోటపేట మీదుగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం కనుల పండువగా రథోత్సవం సాగింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ మద్దిలేటి, మాజీ చైర్మన్ ఈవీ సుజాతశర్మ, కమిటీ సభ్యులు శ్రీధర్ రెడ్డి, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, మారుతి కృష్ణ, రమణ, నాగ మోహన్, శ్రీను పాల్గొన్నారు.

ఆశీర్వాద పండుగల పోస్టర్లు విడుదల

డోన్ టౌన్: స్థానిక సుజాతమ్మనగర్‌లోని ఇమ్మానుయేలు పేయర్ మినిస్ట్రీస్‌లో మంగళవారం ఇమ్మానేయేలు ఆశీర్వాద పండుగ మహోత్సవలకు సంబంధించిన వాల్ పోస్టర్లను పాస్టర్లు, సమైఖ్య క్రైస్తవ నాయకులు విడుదల చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పాస్టర్ తిమోతిపాల్ మాట్లాడుతూ 8వ వార్షికోత్సవంలో భాగంగా మే నెల 9, 10తేదీల్లో పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద ఉన్న క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌లో సాయిత్రం 6గంటల నుంచి రెండు రోజులు వాక్య పరిచర్య, దైవజనులచే రోగుల కోరకు ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందరావు, కార్యదర్శి ఉదయ్‌కుమార్, కోశాధికారి మాణిక్యరెడ్డి, పాస్టర్లు పాల్గొన్నారు.

16 నుంచి ఐఎఫ్‌టీయూ మహాసభలు

డోన్ టౌన్: తిరుపతిలో 16 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఐఎఫ్‌టీయూ మహా సభల పోస్టర్లను మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఆవరణంలో నాయకులు విడుదల చేశారు. అఖిల భారత మహా సభలకు కార్మికులు,కర్షకులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మల్లికార్జున, శ్రీరాములు, దాసు, నాగరాజు, తిరుపాలు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విప్లవ యోధుడు జ్యోతిరావు పూలే


మంత్రి బుగ్గన స్వగృహంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కోవెలకుంట్ల: మహాత్మ జ్యోతిరావు పూలే విప్లవ యోధుడని వక్తలు కొనియాడారు. బనగానపల్లె నియోజకవర్గంలో మంగళవారం పూలే 196 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ తిమ్మారెడ్డి, కులవివక్ష పోరాట సమితి కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, పరంధామ నిలయంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీపతి, ఉసేనయ్య, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు, సురేష్‌రెడ్డి, సుగుణ, నీరజ, వరలక్ష్మి, జ్యోతి, జహీరాబీ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ సుబ్బరాజు ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం,ఏపీఓ గంగన్న,పంచాయితీ కార్యదర్శులు సుబ్బరాయుడు, రవికుమార్,డీఆర్‌డీఏ సీసీలు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్ : స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో మహాత్మాజ్యోతిరావ్ పూలే 197వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మాజ్యోతిరావ్ పూలే అని ఈ సందర్భంగా బీసీ సంఘం జిల్లా నాయకుడు పాండురంగయాదవ్ కొనియాడారు. కార్యక్రమంలో యాదవ మహాసభ నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య యాదవ్, దూదేకుల సంఘం నాయకుడు దస్తగిరి, గిరిజన సంఘం నాయకుడు కోనేటి శ్రీనివాసులు, నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర,మౌలాలీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యయలం, మంత్రి బుగ్గన స్వగృహంలో మంగళవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతపేట హైస్కూల్లో హెచ్‌ఎం పద్మావతమ్మ, ఉపాధ్యాయుడు వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటేశ్వర్లును సత్కరించారు.



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంఈఓ, నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు